అక్షరశక్తి

The Power of Pen

Evening Daily

సంపుటి: 20 | సంచిక: 346 | వరంగల్ | శుక్రవారం, 30 అక్టోబర్ 2026 | పేజీలు: 05



తల్లి గర్భంలోనే హెచ్ఐవీ మహమ్మారికి అడ్డుకట్ట వేయాలి.. పుట్టబోయే ప్రతి బిడ్డకు వైరస్ రహిత జీవితాన్ని అందించాలి! తల్లి నుంచి బిడ్డకు హెచ్ఐవీ సంక్రమించకుండా పకడ్బందీ వైద్య పరీక్షలు, ఆధునిక చికిత్సా విధానాలను అమలు చేయాలని హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. హెచ్ఐవీ నియంత్రణలో నిర్లక్ష్యానికి తావులేకుండా 95-95-95 లక్ష్యాల సాధనకు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. జిల్లాను సురక్ష జిల్లాగా తీర్చిదిద్దడంలో వైద్యాధికారులు అందించిన సేవలను అభినందించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో సమ్మాన్–సమారోహ్, ఈవీటీఎస్ క్లినికల్ ఆడిట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ, గర్భిణులకు నిర్వహిస్తున్న వైద్య పరీక్షలు, చికిత్సా విధానాలు, తల్లి నుంచి బిడ్డకు వైరస్ వ్యాప్తి నివారణ చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణులకు గర్భధారణ ప్రారంభ దశలోనే యాంటినేటల్ కేర్ (ఏఎన్‌సీ) పరీక్షల్లో భాగంగా హెచ్ఐవీ, సిఫిలిస్, హెపటైటిస్–బి (హెచ్‌బీఎస్ఏజీ) పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ప్రసవానికి ముందు అవసరమైన పరీక్షలు మరోసారి చేపట్టి, వ్యాధులు నిర్ధారణైన వారికి సకాలంలో చికిత్స అందించాలని సూచించారు. హెచ్ఐవీ పాజిటివ్‌గా తేలిన గర్భిణులకు యాంటీ రిట్రోవైరల్ థెరపీ (ఏఆర్‌టీ) మందులు క్రమం తప్పకుండా అందేలా చూడాలన్నారు. -అక్షరశక్తి, హనుమకొండ

- ప్రతి శిశువుకు హెచ్ఐవీ రహిత జీవితమే లక్ష్యం
- గర్భిణులకు హెచ్ఐవీ, సిఫిలిస్, హెపటైటిస్-బి పరీక్షలు తప్పనిసరి
- 95-95-95 లక్ష్యాల సాధనకు సమష్టి కృషి చేయాలి
- ‘ఎయిడ్స్ సురక్ష ప్లస్’తో విస్తృత అవగాహన
- జిల్లాను సురక్ష జిల్లాగా తీర్చిదిద్దిన వైద్యాధికారులకు కలెక్టర్ సత్కారం

5

పుట్టే బిడ్డకు భద్రత!







డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

- నేరాల నియంత్రణకు ప్రత్యేక తనిఖీలు
- 107 మంది అదుపులోకి..
- 29 మందికి డ్రగ్స్ పరీక్షల్లో పాజిటివ్
- 17 ద్విచక్ర వాహనాలు, 2 కార్లు, 3 మోటార్ పంపులు స్వాధీనం



నేరరహిత వరంగల్ నిర్మాణంతో పాటు డ్రగ్స్ రహిత సమాజమే తమ లక్ష్యమని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ తెలిపారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలో మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.
- అక్షరశక్తి, హనుమకొండ క్రైమ్

2

ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

నవంబర్ 2న మరోసారి సమావేశమై సమస్యల పరిష్కారంపై చర్చిస్తాం: మంత్రి దామోదర రాజనర్సింహా



రాష్ట్రవ్యాప్తంగా గత 18 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా హామీ ఇచ్చారు.
- అక్షరశక్తి, హైదరాబాద్

3

ఐకమత్యంతో ఆర్థిక అభివృద్ధి

- భద్రకాళి మున్నూరు కాపు పరపతి సంఘం అధ్యక్షుడు పోతురాజు తిరుమల్ రావు.



అక్షరశక్తి,హన్మకొండ: ఐకమత్యంతో ముందుకెళ్తే ఆర్థిక అభివృద్ధి సాధించవచ్చని భద్రకాళి మున్నూరు కాపు పరపతి సంఘం అధ్యక్షుడు పోతురాజు తిరుమల్ రావు అన్నారు. హనుమకొండ లోని న్యూ రాయపుర కు చెందిన పరపతి సంఘం ఆధ్వర్యంలో మూడు రోజుల విహారయాత్ర ముగించుకుని వచ్చారు. 120 మంది సభ్యులతో బయలుదేరిన యాత్ర మూడు రోజులపాటు కొనసాగి శుక్రవారం హనుమకొండకు చేరుకున్నారు.అన్నవరం, సింహాచలం ,ద్రాక్షారామం క్షేత్రాలను దర్శించుకున్నారు. ఎల్ నినో నుండి రాష్ట్రాన్ని రక్షించి రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు సమృద్ధిగా ఉండేలా చూడాలని భగవంతుని ప్రార్థించినట్లు తెలిపారు. పరపతి సంఘంతో సభ్యులకు ఆర్థికంగా అండగా నిలవడంతో పాటు, ఐక్యమత్యాన్ని చాటడమే ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి లక్కాకుల రాజు, కోశాధికారి సత్తు భిక్షపతి, ఉపాధ్యక్షులు గాండ్ల సంతోష్, తుల రాజు, సహాయ కార్యదర్శి బొల్లం అమరావతి, అనుమాల భాస్కర్, ప్రచార కార్యదర్శి లక్కాకుల గోపి , డైరెక్టర్లు ముడిదొడ్ల రంజిత్, మీరుపెల్లి అశోక్, సలహాదారులు రచ్చోరు శ్రీకాంత్ బాబు ,తోట వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ దివస్‌ను విజయవంతం చేయాలి

కాకతీయ యూనివర్సిటీలో వాల్ పోస్టర్ ఆవిష్కరణ



అక్షరశక్తి, కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో నవంబర్ 23న నిర్వహించనున్న ప్రతిజ్ఞ దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, కార్యక్రమ కన్వీనర్ ఎల్తూరి సాయికుమార్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. స్వేరో స్టూడెంట్స్ యూనియన్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నవంబర్ 23న కాకతీయ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియం ముందు ప్రతిజ్ఞ దివస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, స్వేరోస్ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా శుక్రవారం కాకతీయ యూనివర్సిటీ దూరవిద్యా కేంద్రం (ఎస్‌డీఎల్‌సీఈ) ప్రాంగణంలో ప్రతిజ్ఞ దివస్‌కు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ స్వేరోస్ నాయకులు, స్వేరో స్టూడెంట్స్ యూనియన్ నాయకులు, పీపీఎల్ నాయకులు, కార్యక్రమ సహ కన్వీనర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ యూనివర్సిటీలో నీటి వృథా..

పట్టించుకోని అధికారులు



అక్షరశక్తి,కేయూ క్యాంపస్: కాకతీయ విశ్వవిద్యాలయంలోని పరిశోధక విద్యార్థుల వసతి గృహంలో నిత్యం గంటల తరబడి నీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి వృథాను అరికట్టాలని పలుమార్లు వసతి గృహ సంరక్షకుడు రాజుకు విన్నవించినా స్పందన లేకపోవడంతో శుక్రవారం నీరు వృథాగా పోతున్న దృశ్యాలను చిత్రీకరించి పత్రికలు, సామాజిక మాధ్యమాలకు విడుదల చేశారు. వృథాగా పోతున్న నీటితో పరిసరాలు బురదమయంగా మారడంతో పాటు దుర్వాసన, దోమలు, ఈగల సమస్య పెరుగుతోందని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టడంతో పాటు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని పరిశోధక విద్యార్థులు కోరారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

- నేరాల నియంత్రణకు ప్రత్యేక తనిఖీలు
- 107 మంది అదుపులోకి..
- 29 మందికి డ్రగ్స్ పరీక్షల్లో పాజిటివ్
- 17 ద్విచక్ర వాహనాలు, 2 కార్లు, 3 మోటార్ పంపులు స్వాధీనం



అక్షరశక్తి, హనుమకొండ క్రైమ్: నేరరహిత వరంగల్ నిర్మాణంతో పాటు డ్రగ్స్ రహిత సమాజమే తమ లక్ష్యమని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ తెలిపారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలో మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా శుక్రవారం తెల్లవారుజామున పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత ఆధ్వర్యంలో ఆటోనగర్, కరీమాబాద్, కాశిబుగ్గ, శంభునిపేట, శివనగర్, ఎల్.బి. నగర్ ప్రాంతాల్లో పోలీసులు విస్తృతంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రౌడీషీటర్లు, పాత నేరస్థులు, డ్రగ్స్ కేసులతో సంబంధం ఉన్నవారు, అనుమానితులు కలిపి మొత్తం 107 మందిని అదుపులోకి తీసుకొని మాదకద్రవ్యాల పరీక్షలు నిర్వహించారు. వీరిలో 29 మందికి పరీక్షల్లో పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు సీపీ తెలిపారు. వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

డ్రగ్స్‌పై కఠిన చర్యలు

మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తుకు, సమాజ భద్రతకు తీవ్ర ముప్పుగా పరిణమిస్తోందని సీపీ పేర్కొన్నారు. డ్రగ్స్ సరఫరా, విక్రయాలు, అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యసనానికి గురైన వారికి చికిత్స, కౌన్సెలింగ్ అందించి తిరిగి సాధారణ జీవనంలోకి తీసుకువచ్చేందుకు కూడా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.



వాహనాలు స్వాధీనం.. కేసు నమోదు

తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 17 ద్విచక్ర వాహనాలు, రెండు కార్లు, మూడు విద్యుత్ మోటార్ పంపులను పోలీసులు నిబంధనల ప్రకారం స్వాధీనం చేసుకున్నారు. అలాగే మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో పిటా చట్టం కింద ఒక కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు సూచన

కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రజలతో పోలీసులు మాట్లాడి ఆయా ప్రాంతాల్లో నెలకొన్న నేరాలు, అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం సేకరించారు. నేరాల నియంత్రణలో సీసీటీవీ కెమెరాల ప్రాధాన్యతను వివరించి, ప్రతి కాలనీలో ప్రజల భాగస్వామ్యంతో సామూహిక నిఘా కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇకపై కూడా ఇలాంటి ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని సీపీ స్పష్టం చేశారు. డ్రగ్స్ వినియోగం, విక్రయాలు లేదా ఇతర నేరాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే డయల్ 100 లేదా 112కు, సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని ప్రజలను కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. ఈ తనిఖీల్లో సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత, వరంగల్ ఇన్‌చార్జి ఏసీపీ నరసింహారావు, మట్టెవాడ,ఇంతేజార్ గంజ్, మిల్స్ కాలనీ, మడికొండ, ఐటీ కోర్ పోలీస్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సృజనాత్మక ఆలోచనలతో.. ఆవిష్కరణల వైపు అడుగులు

అక్షరశక్తి, ములుగు: స్థానిక సమస్యలకు పరిష్కారం చూపే సృజనాత్మక ఆలోచనలతో విద్యార్థులు ముందుకు రావాలని జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం. సంపత్ రావు సూచించారు. ఇన్నోవేషన్ పంచాయతీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ములుగులో నిర్వహించిన 'వాక్ ఫర్ ఇన్నోవేషన్' కార్యక్రమాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ములుగు జూనియర్ కళాశాల నుంచి మెయిన్ రోడ్డు మీదుగా జిల్లా విద్యాశాఖ కార్యాలయం వరకు ఈ వాక్ ఫర్ ఇన్నోవేషన్ కార్యక్రమం సాగింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరిలోని ప్రతిభను వెలికితీసి, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడమే ఇన్నోవేషన్ పంచాయతీ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. విద్యార్థులు తమ పరిసరాల్లోని సమస్యలను గుర్తించి, వాటికి ఉపయోగకరమైన పరిష్కారాలను ఆలోచించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ్ రెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి వీరేందర్, ఈడీఎం దేవేందర్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భగవద్గీత, టీజీఐసీ గ్రాస్‌రూట్ లీడ్ రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సర్దార్ పటేల్ ఆశయాలను కొనసాగించాలి

- లాల్‌బహదూర్ కళాశాలలో జాతీయ ఏకీకరణ దినోత్సవ ప్రతిజ్ఞ

అక్షరశక్తి, వరంగల్, అక్టోబర్ 30: దేశ సమైక్యత, సమగ్రతకు పునాదులు వేసిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయాలను యువత కొనసాగించాలని లాల్‌బహదూర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్ రావు పిలుపునిచ్చారు.సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని అక్టోబర్ 31న నిర్వహించే జాతీయ ఏకీకరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కళాశాల ఎన్‌సీసీ ఆర్మీ 10వ తెలంగాణ బెటాలియన్ ఆధ్వర్యంలో ముందస్తు కార్యక్రమాలు నిర్వహించారు. స్వాతంత్ర్యానంతరం 555 సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసి జాతీయ సమైక్యతకు పటేల్ చేసిన కృషిని ఆమె వివరించారు. అనంతరం ఎన్‌సీసీ క్యాడెట్లు జాతీయ సమైక్యత ప్రతిజ్ఞ చేశారు. కళాశాల నుంచి ములుగు రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కెప్టెన్ డాక్టర్ ఎం. సదానందం, హరి, లోకేష్, రాకేష్, గోకుల్, అక్షిత, ఎండీ రియాన్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

- **నవంబర్ 2న మరోసారి సమావేశమై సమస్యల పరిష్కారంపై చర్చిస్తాం: మంత్రి దామోదర రాజనర్సింహా**



అక్షరశక్తి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా గత 18 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో శుక్రవారం తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంధం రాములు ఆధ్వర్యంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగ సంఘం రాష్ట్ర నాయకులు మంత్రిని కలిసి తమ సమస్యలను వివరించారు. గత 18 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నారని, తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని మంత్రిని కోరారు. ఉద్యోగుల సమస్యలపై మంత్రి దామోదర రాజనర్సింహా సానుకూలంగా స్పందించారు. ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి ప్రయత్నిస్తానని తెలిపారు. సమ్మెను ముగించే దిశగా నవంబర్ 2న మరోసారి సమావేశమై సమస్యలపై చర్చించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి. సంజీవ్ నాయక్, డాక్టర్ కరుణాకర్, డాక్టర్ కుమార్ నాయక్, డాక్టర్ రాజేశ్వర్, డాక్టర్ నాగరాజు, డాక్టర్ పుష్పలత, ఓయూ జేఏసీ చైర్మన్ డాక్టర్ పురుషోత్తం పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం: మంత్రి శ్రీధర్ బాబు





- **ఒడితలలో రూ.2.20 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం**

అక్షరశక్తి ,భూపాలపల్లి: రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా, సాగునీటి వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. శుక్రవారం చిట్యాల మండలం ఒడితల గ్రామంలో ఎన్‌పీడీసీఎల్ ఆధ్వర్యంలో రూ.2.20 కోట్ల వ్యయంతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత రెండున్నరేళ్లలో జిల్లాలో 12 నూతన విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందించడంతో పాటు గోదావరి జలాలను డీబీఎం38 ద్వారా రైతులకు అందించే ప్రణాళికలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకొని సాగునీటి వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సుమారు రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 14 వేల మెగావాట్ల నుంచి 21 వేల మెగావాట్లకు పెంచినట్లు తెలిపారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని గాంధీనగర్ గుట్ట ప్రాంతంలో మరో 33/11 కేవీ సబ్‌స్టేషన్ మంజూరు చేయాలని మంత్రిని కోరినట్లు చెప్పారు. డీబీఎం38 ద్వారా 44,770 ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు ఎస్సారెస్పీ పరిధిలోని మరో 70 వేల ఎకరాలకు నీటిని అనుసంధానం చేసే ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్ మోహన్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజబాబు, మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ సదానందం, సర్పంచ్ బండి భగవాన్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.





కొత్త నోటిఫికేషన్‌కు ముందే బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి

- **కేయూ వీసీకి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ వినతి**



అక్షరశక్తి, హనుమకొండ, అక్టోబర్ 30: కాకతీయ విశ్వవిద్యాలయంలో కొత్త అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామక నోటిఫికేషన్ విడుదలకు ముందే గతంలో మిగిలిపోయిన బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఈ. నారాయణ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ పుల్లా శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం వీసీ ప్రొఫెసర్ కె. ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పుల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ.. 2009, 2012 నోటిఫికేషన్ల ద్వారా భర్తీ కాకుండా మిగిలిపోయిన ఎస్సీ, ఎస్టీ, ఇతర రిజర్వుడ్ కేటగిరీల బ్యాక్‌లాగ్ పోస్టులు ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఏళ్లుగా ఎదురుచూస్తున్న అర్హులైన అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు. గత నోటిఫికేషన్లకు సంబంధించిన రిజర్వుడ్ పోస్టుల భర్తీ ప్రక్రియను ముందుగా పూర్తి చేసి, ఆ తర్వాతే కొత్త అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామక ప్రకటన విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై వీసీ ప్రొఫెసర్ కె. ప్రతాప్‌రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ నిబంధనలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు అసోసియేషన్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు, అధ్యాపకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో ఖాళీ సీట్లు భర్తీ చేయాలి



అక్షరశక్తి,కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో మిగిలి ఉన్న సీట్లను వెంటనే భర్తీ చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు విద్యార్థులతో కలిసి యూనివర్సిటీ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ అధ్యక్ష కార్యదర్శులు చెన్నూరు సాయి కుమార్, బీరెడ్డి జశ్వంత్ మాట్లాడుతూ, కళాశాలలో అనేక సీట్లు ఖాళీగా ఉన్నప్పటికీ భర్తీకి అధికారులు చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఇతర కళాశాలల్లో ఖాళీ సీట్ల భర్తీకి చర్యలు చేపడుతున్నప్పుడు ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలపై నిర్లక్ష్యం ఎందుకని ప్రశ్నించారు. అర్హులైన విద్యార్థులు, క్రీడాకారులు నష్టపోకుండా రిజిస్ట్రార్ తక్షణమే జోక్యం చేసుకుని నిబంధనల ప్రకారం ఖాళీ సీట్లన్నింటినీ భర్తీ చేయాలని కోరారు.

రామప్పను సందర్శించిన బంగ్లాదేశ్ జర్నలిస్టులు



అక్షరశక్తి, పాలంపేట: ములుగు జిల్లా వెంకటాపురం మండలం పాలంపేట గ్రామంలోని ప్రపంచ వారసత్వ సంపద రామప్ప దేవాలయాన్ని శుక్రవారం బంగ్లాదేశ్‌కు చెందిన 40 మంది జర్నలిస్టులు, అధికారులు సందర్శించారు. హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ పొందుతున్న వీరు భారత్ దర్శన్ కార్యక్రమంలో భాగంగా రామప్ప ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉమాశంకర్ ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. పర్యాటక మార్గదర్శి గోరంట్ల విజయ్ కుమార్ రామప్ప దేవాలయ చరిత్ర, కాకతీయుల శిల్పకళా వైభవం, ఆలయ నిర్మాణ విశిష్టతలను వారికి వివరించారు. అనంతరం బృందం రామప్ప చెరువును సందర్శించి బోటింగ్‌లో పాల్గొంది. రామప్ప దేవాలయంతో పాటు వరంగల్ కోట, వేయి స్తంభాల దేవాలయాన్ని కూడా సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఇమ్మడి భాస్కర్, మానవ వనరుల అభివృద్ధి సంస్థ అధికారులు, పర్యాటక పోలీసులు బద్రు, శ్రీనివాస్, అరుణ్, శ్రీకాంత్‌తో పాటు రెవెన్యూ, పురావస్తు, దేవాదాయ, పర్యాటక శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక

- **అండర్-18 టెన్నికాయిట్ సెలక్షన్స్‌కు 300 మంది హాజరు**

అక్షరశక్తి, హన్మకొండ, అక్టోబర్ 30: ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి 13వ జూనియర్ బాలబాలికల అండర్-18 టెన్నికాయిట్ జట్ల ఎంపిక పోటీలు గురువారం జవహర్‌లాల్ నెహ్రూ క్రీడా మైదానంలో నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగిన ఈ ఎంపికల్లో సుమారు 150 మంది బాలురు, 150 మంది బాలికలు కలిపి 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు నవంబర్ 1న హైదరాబాద్ అంబర్‌పేట క్రీడా మైదానంలో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర టెన్నికాయిట్ కోశాధికారి అలువాల రాజకుమార్, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోకారపు శ్యాంకుమార్, ఉమ్మడి వరంగల్ జిల్లా కోశాధికారి జహూర్, సీనియర్ క్రీడాకారులు వెంకన్న, మేకల ధర్మరాజు, బూజుగుండ్ల సీతారాం, క్రీడాకారులు, ఫిజికల్ డైరెక్టర్లు, పీటీలు పాల్గొన్నారు.



పరిశోధన రంగంలో ప్రొఫెసర్ గాదేకు అరుదైన గుర్తింపు

ASTC లైఫ్ మెంబర్ అవార్డు ప్రదానం



అక్షరశక్తి, హనుమకొండ, అక్టోబర్ 30: పరిశోధన రంగంలో విశిష్ట సేవలు అందించిన కాకతీయ విశ్వవిద్యాలయం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ప్రొఫెసర్ గాదే సమ్మయ్యకు ప్రతిష్ఠాత్మక ASTC లైఫ్ మెంబర్ అవార్డు లభించింది. హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్-నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో శుక్రవారం నిర్వహించిన అకాడమీ ఫర్ సైన్స్, టెక్నాలజీ అండ్ కమ్యూనికేషన్ (ASTC) వార్షిక మహాసభ-2026లో ఈ అవార్డును ప్రదానం చేశారు. మిశ్ర ధాతు నిగమ్ లిమిటెడ్ (మిధాని) ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.వి.ఎస్. నారాయణ మూర్తి అవార్డును అందజేశారు. ముఖ్య అతిథిగా కేంద్ర భూ విజ్ఞాన మంత్రిత్వ శాఖ కార్యదర్శి డాక్టర్ టి. శ్రీనివాస కుమార్ హాజరయ్యారు. సీఎస్ఐఆర్-ఎన్‌జీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ ప్రకాశ్ కుమార్, మాజీ సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ ఎన్. చి. మోహన్ రావు తదితర శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. పరిశోధన, శాస్త్రీయ సేవలు, విజ్ఞాన వ్యాప్తికి ఆయన చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డు అందించారు. ఈ సందర్భంగా పలువురు శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, అధ్యాపకులు, విద్యార్థులు ప్రొఫెసర్ సమ్మయ్యను అభినందించారు.

పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని కలిసిన నూతన కమిటీ



అక్షరశక్తి, హన్మకొండ, అక్టోబర్ 30: పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం ఉదయం నూతన పార్ట్‌టైం అసోసియేషన్ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలను వివరించారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే.. నవంబర్ 2న వేం నరేందర్‌రెడ్డిని, అదే రోజు ముఖ్యమంత్రిని కలిసి అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. నూతన కమిటీ సభ్యులను శాలువాలతో సన్మానించి బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ అడ్వైజర్ డాక్టర్ ఓ. మోహన్, అధ్యక్షుడు డాక్టర్ కె. రాజేందర్, ప్రధాన కార్యదర్శి కె. నాగేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ వాణిదేవి, కన్వీనర్ డాక్టర్ టి. భాగ్యమ్మ, కోశాధికారి డాక్టర్ టి. మౌనిక, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ పి. మహేందర్, ఉపాధ్యక్షులు డాక్టర్ టి. జోష్ణ, డాక్టర్ ఆర్. శ్యాంసుందర్ చారి, డాక్టర్ బి. సుధీర్, కార్యవర్గ సభ్యులు డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ బండి శీను, డాక్టర్ బి. రామ్మోహన్, సంయుక్త కార్యదర్శులు డాక్టర్ సద్గున, డాక్టర్ యశోదర, డాక్టర్ పి. శ్రీనివాస్, పీఆర్వో హరికుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద కేసులో నిందితుడికి జైలుశిక్ష

ఆరు నెలల జైలు.. రూ.1,500 జరిమానా

అక్షరశక్తి, పరకాల, అక్టోబర్ 30: రోడ్డు ప్రమాదానికి సంబంధించిన కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి పరకాల కోర్టు ఆరు నెలల జైలుశిక్షతో పాటు రూ.1,500 జరిమానా విధించింది. పరకాల పోలీస్‌స్టేషన్‌లో 2015లో నమోదైన క్రైం నంబర్ 101/2015, సీసీ నంబర్ 202/2015 కేసులో ఐపీసీ 304(ఏ) సెక్షన్ కింద దోరికా కృష్ణారావుపై అభియోగాలు నమోదయ్యాయి. ఈ కేసులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కర్రు రుధిర సమర్థవంతంగా వాదనలు వినిపించగా, ప్రిన్సిపల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ జి. సాయిశరత్ తీర్పు వెలువరించారు. ఎస్ఐ దీపక్ కేసు దర్యాప్తు చేయగా, ఇన్‌స్పెక్టర్ అద్దూరి ప్రవీణ్‌కుమార్ పర్యవేక్షణలో విచారణ కొనసాగింది. కోర్టులో సాక్షులను కానిస్టేబుల్ నాగరాజు, హోంగార్డు సారంగపాణి ప్రవేశపెట్టారు. దీంతో నిందితుడికి శిక్ష ఖరారైంది.

వరికి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

అదనపు కలెక్టర్ రవి



అక్షరశక్తి, హసన్‌పర్తి, అక్టోబర్ 30: రైతులు వరికి ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలపై దృష్టి సారించాలని హన్మకొండ జిల్లా అదనపు కలెక్టర్ రవి సూచించారు. నేల ఆరోగ్యం, నీటి వనరుల పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ స్థిరమైన వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని కోరారు. హసన్‌పర్తి మండలం నాగారం రైతు వేదికలో మండల వ్యవసాయ అధికారి అనురాధ ఆధ్వర్యంలో, సర్పంచ్ సందరాజు లావణ్య అధ్యక్షతన 'ఖేత్ బచావో అభియాన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రైతులు భూసార పరీక్షలు చేయించుకుని నేల స్వభావానికి అనుగుణంగా సమతుల్య ఎరువులు వినియోగించాలన్నారు. నాణ్యమైన విత్తనాల ఎంపిక, పంటల మార్పిడి, చీడపీడల నివారణపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావం, భూగర్భ జలాల తగ్గుదల, విద్యుత్ అంతరాయాలను దృష్టిలో ఉంచుకుని యాసంగిలో ఆరుతడి పంటలకు ప్రాధాన్యమివ్వాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర మాట్లాడుతూ ఆధునిక సాగు పద్ధతులతో పెట్టుబడి ఖర్చులు తగ్గించుకుని అధిక దిగుబడులు సాధించాలని, పంట కొయ్యలను కాల్చవద్దని సూచించారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని రైతు సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, పీఏసీఎస్‌లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి కమలాకర్‌రెడ్డి మాట్లాడుతూ నీటి లభ్యతను బట్టి ఆయిల్‌పామ్, కూరగాయల సాగు చేపట్టాలని సూచించారు. వరికి ప్రత్యామ్నాయంగా వేరుశెనగ, పొద్దుతిరుగుడు, పెసర, మినుము, అలసంద, జొన్న సాగు చేయాలని వ్యవసాయ అధికారులు వివరించారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు ఆది రెడ్డి, టీకేవీకే శాస్త్రవేత్త నర్సయ్య, డీఎం టీజీ ఆయిల్‌ఫెడ్ శంకర్, ఏఈఓ తరుణ్, వీఏఎస్‌లు దీపిక, రమేష్, ఆత్మకూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తంగళ్ల పెల్లి తిరుపతి, సర్పంచ్ సందరాజు లావణ్య, ఏఈఓలు శైలజ, సాయి, స్థానిక రైతులు పాల్గొన్నారు.

సీఐడీ అదుపులో ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు

కాట్రగడ్డ సతీష్ ను అరెస్ట్ చేసిన పోలీసులు

అక్షరశక్తి,ములుగు: ములుగు జిల్లా రైస్ మిల్లర్ అసోసియేషన్ అధ్యక్షుడు కాట్రగడ్డ సతీష్ ను సీఐడీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అక్టోబర్ 25న నాటకీయ పరిణామాల మధ్య జరిగిన ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్ష ఎన్నికలలో ఏకగ్రీవంగా ఎన్నికైన 6 రోజులకే CID అధికారులు సతీష్ కుమార్ ఈరోజు ఉదయం నిమిషాలకు వారి స్వగృహం పసర గ్రామంలో అదుపులోకి తీసుకున్నారు. గత అక్టోబర్ 25న ఉదయం 7:30 గంటలకు ప్రాంతంలో రైతు ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్న బాదం ప్రవీణ్ కుమార్ తోపాటు మరో ఐదుగురు రైస్ మిల్లర్స్ ను సిఐడి అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు సతీష్ ను సీఐడీ అధికారులు అరెస్ట్ చెయ్యడం సంచలనంగా మారింది.

ధాన్యం గోల్ మాల్...

హన్మకొండ జిల్లాలోని శాయంపేట మండలం గట్టకానిపర్తిలోని శ్రీలక్ష్మీనర్సింహా, వినాయక ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లుల విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఇదివరకే ఆకస్మికంగా దాడులు చేశారు. 2025 26 ఖరీఫ్, రబీ సీజన్స్‌లో కేటాయించిన సీఎంఆర్ ధాన్యం నిల్వలపై ఫిజికల్‌గా తనిఖీలు చేపట్టారు. కేటాయించిన ధాన్యం, ఇప్పటి వరకు మిల్లరు ప్రభుత్వానికి పెట్టిన బియ్యం పోను ఉండాల్సిన ధాన్యం, ఇతర అంశాలను పరిశీలించినట్లు తెలిసింది. ఈ రెండు మిల్లుల్లో సుమారు రూ.9కోట్ల సీఎంఆర్ ధాన్యం మాయమైనట్లుగా గుర్తించారు. వీటిలో వినాయక ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లులో 202526 ఖరీఫ్, రబీ కలిపి మొత్తం రూ.4,61,29,753 విలువ చేసే 2079 మెట్రిక్ టన్నుల ధాన్యం, అలాగే లక్ష్మీనర్సింహా ఇండస్ట్రీ రైస్ మిల్లులో 202526 రబీకి సంబంధించి సుమారు రూ. 4,42,54,886 విలువ చేసే 1531.84 మెట్రిక్ టన్నుల ధాన్యం వ్యత్యాసం ఉన్నట్లు సివిల్ సప్లయ్ అధికారులు తెలిపారు. వీరిపై కేసులు నమోదు చేశామన్నారు. జిల్లాలోని పలు రైస్ మిల్లులపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు ఇటీవల విస్తృతంగా తనిఖీలు చేపట్టాయి. ధాన్యం కొనుగోళ్లు, నిల్వల రికార్డులు, సీఎంఆర్ బియ్యం లెకలు, గోదాముల్లో నిల్వ ఉంచిన ధాన్యం వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాయి. రికార్డులకు భిన్నంగా నిల్వలు ఉన్నాయా, ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించారా.. అనే అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తున్నది. అలాగే జిల్లాలో 201011 నుంచి 202324 మధ్య కాలంలో ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి 10 రైస్ మిల్లులపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు సివిల్ సప్లయ్ అధికారులు తెలిపారు. ఈ మిల్లుల నుంచి సుమారు రూ.85,09,76,205 (25 శాతం జరిమానా కలుపుకొని) విలువ చేసే 75,302 మెట్రిక్ టన్నుల ధాన్యం బకాయి ఉన్నారని, అనేక సార్లు గడువు ఇచ్చినా మిల్లర్లు సీఎంఆర్ పెట్టలేదని, దీంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా రైస్ మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు అధికారులు చెప్పారు.

అమరుల ఆశయ సాధనకు యువత కృషి చేయాలి



అక్షరశక్తి, తొర్రూరు, అక్టోబర్ 30: పీడిత ప్రజలపై కొనసాగుతున్న దోపిడీ, అణచివేతలను అంతం చేయాలనే లక్ష్యంతో విప్లవకారులు తమ ప్రాణాలను త్యాగం చేశారని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. నవంబర్ 1 నుంచి 7 వరకు నిర్వహించనున్న అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా శుక్రవారం తొర్రూరు ఆర్టీసీ బస్టాండ్ వద్ద కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ భూమి, భుక్తి, దేశ విముక్తి లక్ష్యంగా సాగిన దీర్ఘకాలిక విప్లవోద్యమంలో వందలాది మంది ప్రాణత్యాగాలు చేసి ప్రజా ఉద్యమాలకు దిశానిర్దేశం చేశారని పేర్కొన్నారు. అమరుల ఆశయమైన దోపిడీ లేని సమాజ నిర్మాణం ఇంకా నెరవేరలేదని, ఆ లక్ష్య సాధనకు నేటి యువత కృషి చేయాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగం, పేదరికం, వలసలు, ఆకలి చావులు వంటి సమస్యలు ప్రజలను పట్టిపీడిస్తున్నాయని, ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమవుతున్నాయని విమర్శించారు. ప్రశ్నించే గొంతులపై నిర్బంధాలు ప్రయోగిస్తున్నాయని ఆరోపించారు. ఐక్య సమరశీల వర్గ పోరాటాల ద్వారా నూతన ప్రజాస్వామిక విప్లవ సాధనకు అమరుల ఆశయబాటలో నడవాలని కోరారు. డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న మాట్లాడుతూ నవంబర్ 1 నుంచి 7 వరకు గ్రామగ్రామాన అమరవీరుల సంస్మరణ సభలు, జెండా ఆవిష్కరణలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డివిజన్ సీనియర్ నాయకులు ఊడుగుల రాములు, ఇరుగు అనిల్, సేగ్గం యాకయ్య, చింతా నవీన్, యాకయ్య, వెంకన్న, వీరన్న, మధు, మహేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సేవిస్తూ ఇద్దరు యువకుల పట్టివేత

30 గ్రాముల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం

అక్షరశక్తి, హసన్‌పర్తి, అక్టోబర్ 30: గంజాయి సేవించేందుకు వెళ్తూ పోలీసులకు పట్టుబడిన ఇద్దరు యువకులను హసన్‌పర్తి పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. అక్టోబర్ 29న వంగపహాడ్ ఓఆర్ఆర్ క్రాస్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా, వంగపహాడ్ వైపు నుంచి వస్తున్న ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. అప్రమత్తమైన పోలీసులు వారిని పట్టుకుని తనిఖీ చేయగా 30 గ్రాముల గంజాయి లభించింది. విచారణలో కరీమాబాద్‌కు చెందిన సయ్యద్ ముస్తఫా (30), మాచర్ల శివ అలియాస్ వంశీ (25) తలా రూ.500 చొప్పున వేసుకుని అక్టోబర్ 28న వరంగల్‌లో 30 గ్రాముల గంజాయి కొనుగోలు చేసినట్లు వెల్లడైంది. గంజాయి విలువ సుమారు రూ.1,500గా అంచనా వేశారు. నిందితుల నుంచి రెడ్‌మీ ఏ1 ప్లస్, ఒప్పో ఏ3ఎస్ మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

దేశాయిపేట ఫిల్టర్ బెడ్ షట్‌డౌన్..

11 ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం

అక్షరశక్తి, వరంగల్: దేశాయిపేట వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పరిధిలోని పోతన రోడ్డులో పైప్‌లైన్ ఇంటర్‌కనెక్షన్ పనులు, కరీమాబాద్ లైన్‌లో లీకేజీ మరమ్మతుల కారణంగా రేపు శనివారం (అక్టోబర్ 31) దేశాయిపేట ఫిల్టర్‌ను తాత్కాలికంగా షట్‌డౌన్ చేస్తున్నట్లు (నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు) జీడబ్ల్యూఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సంజయ్ కుమార్ నేడొక ప్రకటనలో తెలిపారు. దీంతో కొత్తవాడ, ఎల్‌బీ నగర్, కాశిబుగ్గ, అబ్బనికుంట, ఆరెపల్లి, ఎనుమాముల, మొగిలిచర్ల, చార్‌బౌలి, మట్టెవాడ, గొర్రెకుంట, జీఆర్ గుట్ట ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం కలగనుందని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు ఈ విషయాన్ని గమనించి ముందస్తుగా అవసరమైన నీటిని నిల్వ చేసుకోని సహకరించాలని ఆయన కోరారు.

రేషన్ డీలర్ల రాష్ట్ర సలహాదారుగా కొమురయ్య పటేల్

నియామక పత్రం అందజేసిన రాష్ట్ర అధ్యక్షుడు నాయకోటి రాజు



అక్షరశక్తి, వరంగల్, అక్టోబర్ 30: తెలంగాణ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారుగా వరంగల్ మండలానికి చెందిన సీనియర్ డీలర్ మాడిశెట్టి కొమురయ్య పటేల్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయకోటి రాజు ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. కొమురయ్య పటేల్ నియామకంపై రాష్ట్ర ఉపాధ్యక్షుడు, వరంగల్ మండల రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గజ్జి గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి రాజేందర్, కోశాధికారి బసవరాజు సాంబయ్య, షబ్బీర్ అలీ, పగిడ ధర్మారావు, మాడిశెట్టి చంద్రశేఖర్ పటేల్, శ్రీరామ్ నారాయణ, వేణు, లక్కసు రాజు తదితరులు హర్షం వ్యక్తం చేశారు. సీనియర్ డీలర్‌గా ఉన్న అనుభవంతో రేషన్ డీలర్ల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి ఆయన కృషి చేయాలని ఆకాంక్షించారు. పలువురు డీలర్లు కొమురయ్య పటేల్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

జాతీయవాదుల సంగమాన్ని విజయవంతం చేయాలి

నవంబర్ 3న హైదరాబాద్‌లో పూర్వ ఏబీవీపీ కార్యకర్తల సమ్మేళనం

అక్షరశక్తి, హనుమకొండ, అక్టోబర్ 30: నవంబర్ 3న హైదరాబాద్‌లో నిర్వహించనున్న జాతీయవాదుల సంగమం-2026 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్యక్రమ కన్వీనర్ పొనుగోటి పాపారావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పూర్వ ఏబీవీపీ కార్యకర్తలు, నాయకుల సన్నాహక సమావేశం హనుమకొండ బాలసముద్రంలోని సామ జగన్మోహన్‌రెడ్డి భవన్‌లో నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన పాపారావు మాట్లాడుతూ నవంబర్ 3న సాయంత్రం 4 గంటలకు హైదరాబాద్ నాగోల్‌లోని శుభం కన్వెన్షన్ హాల్‌లో జాతీయవాదుల సంగమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్‌లో పనిచేసిన పూర్వ విద్యార్థులు, కార్యకర్తల సమాగమంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా డాక్టర్ కాసం వెంకటేశ్వర్లుకు అభినందన సభతోపాటు సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పూర్వ ఏబీవీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్ ముఖ్య అతిథిగా పాల్గొని తెలంగాణ జాతీయవాదులను ఉద్దేశించి ప్రసంగిస్తారని తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి పూర్వ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పుట్టే బిడ్డకు భద్రత!

- **ప్రతి శిశువుకు హెచ్ఐవీ రహిత జీవితమే లక్ష్యం**
- **గర్భిణులకు హెచ్ఐవీ, సిఫిలిస్, హెపటైటిస్–బి పరీక్షలు తప్పనిసరి**
- **95-95-95 లక్ష్యాల సాధనకు సమష్టి కృషి చేయాలి**
- **'ఎయిడ్స్ సురక్ష ప్లస్'తో విస్తృత అవగాహన**
- **జిల్లాను సురక్ష జిల్లాగా తీర్చిదిద్దిన వైద్యాధికారులకు కలెక్టర్ సత్కారం**



అక్షరశక్తి, హనుమకొండ: తల్లి గర్భంలోనే హెచ్ఐవీ మహమ్మారికి అడ్డుకట్ట వేయాలి.. పుట్టబోయే ప్రతి బిడ్డకు వైరస్ రహిత జీవితాన్ని అందించాలి! తల్లి నుంచి బిడ్డకు హెచ్ఐవీ సంక్రమించకుండా పకడ్బందీ వైద్య పరీక్షలు, ఆధునిక చికిత్సా విధానాలను అమలు చేయాలని హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. హెచ్ఐవీ నియంత్రణలో నిర్లక్ష్యానికి తావులేకుండా 959595 లక్ష్యాల సాధనకు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. జిల్లాను సురక్ష జిల్లాగా తీర్చిదిద్దడంలో వైద్యాధికారులు అందించిన సేవలను అభినందించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో సమ్మాన్-సమారోహ్, ఈవీటీఎస్ క్లినికల్ ఆడిట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ, గర్భిణులకు నిర్వహిస్తున్న వైద్య పరీక్షలు, చికిత్సా విధానాలు, తల్లి నుంచి బిడ్డకు వైరస్ వ్యాప్తి నివారణ చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణులకు గర్భధారణ ప్రారంభ దశలోనే యాంటినేటల్ కేర్ (ఏఎన్‌సీ) పరీక్షల్లో భాగంగా హెచ్ఐవీ, సిఫిలిస్, హెపటైటిస్-బి (హెచ్‌బీఎస్‌ఏజీ) పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ప్రసవానికి ముందు అవసరమైన పరీక్షలు మరోసారి చేపట్టి, వ్యాధులు నిర్ధారణైన వారికి సకాలంలో చికిత్స అందించాలని సూచించారు. హెచ్ఐవీ పాజిటివ్‌గా తేలిన గర్భిణులకు యాంటీ రిట్రోవైరల్ థెరపీ (ఏఆర్‌టీ) మందులు క్రమం తప్పకుండా అందేలా చూడాలన్నారు.

నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ప్రోగ్రామ్-5 నిర్దేశించిన 95 95 95 లక్ష్యాల సాధనకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు. హెచ్ఐవీ బాధితులను గుర్తించడం, గుర్తించిన వారందరికీ ఏఆర్‌టీ చికిత్స అందించడం, వారి శరీరంలో వైరల్ లోడ్‌ను నియంత్రణలో ఉంచడంపై దృష్టి సారించాలని చెప్పారు. 'ఎయిడ్స్ సురక్ష ప్లస్' కార్యక్రమం ద్వారా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంతోపాటు బాధితుల కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. జిల్లాలో ఏప్రిల్ 2026 నుంచి ఇప్పటివరకు 10,296 మంది గర్భిణులకు పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారులు కలెక్టర్‌కు వివరించారు. ప్రైవేటు ఆసుపత్రుల నుంచి కూడా వైద్య సమాచారాన్ని సమగ్రంగా సేకరించాలని, వలస కార్మికులు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చి జిల్లాలో నివసిస్తున్న వారి ఆరోగ్య వివరాలను గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. అందుబాటులో ఉన్న ఆరోగ్య సమాచార వ్యవస్థలను సమర్థంగా వినియోగించుకోవాలని, హెచ్ఐవీతోపాటు సిఫిలిస్, హెపటైటిస్-బి, మధుమేహం వంటి వ్యాధుల నియంత్రణపైనా దృష్టి సారించాలన్నారు. వైద్యాధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందికి స్పష్టమైన లక్ష్యాలు, బాధ్యతలు కేటాయించి పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు.

అనంతరం ఎయిడ్స్ నియంత్రణలో భాగంగా జిల్లాను సురక్ష జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేసిన వైద్యాధికారులకు కలెక్టర్ జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శేషాద్రి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ మదన్మోహన్‌రావు, జీఎంహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, డీడబ్ల్యూవో విశ్వజ, ఎన్‌సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్ జ్ఞానేశ్వర్, ఎంసీహెచ్ పీవో డాక్టర్ రజిత, ఏఆర్‌టీ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సూర్యప్రకాష్, చెస్ట్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవి, డాక్టర్ వంశీకృష్ణ, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ స్వప్న మాధురి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

అమరవీరుల సంస్మరణ సభను జయప్రదం చేయండి

- **కొత్తగూడలో పాలడుగు కృష్ణ స్మారక సభ.. న్యూడెమోక్రసీ ర్యాలీ**



అక్షరశక్తి, కొత్తగూడ, అక్టోబర్ 30: నవంబర్ 7న కొత్తగూడలో నిర్వహించనున్న కామ్రేడ్ పాలడుగు కృష్ణ స్మారక బహిరంగ సభను ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు పిలుపునిచ్చారు. నవంబర్ 1 నుంచి 9 వరకు నిర్వహించనున్న అమరవీరుల సంస్మరణ సభల్లో భాగంగా శుక్రవారం మండల కమిటీ ఆధ్వర్యంలో కొత్తగూడలో మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గూడూరు డివిజన్ కార్యదర్శి కామ్రేడ్ సూర్యం మాట్లాడుతూ.. దోపిడీ, పీడన, అసమానతలు లేని నూతన సమాజ నిర్మాణం కోసం పోరాడి అమరులైన విప్లవ యోధులకు నివాళులర్పించాలన్నారు. సంస్మరణ సభలను గ్రామగ్రామాన విస్తృతంగా నిర్వహించాలని కోరారు. నవంబర్ 7న జరిగే పాలడుగు కృష్ణ స్మారక సభకు ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పుల్ల శ్రీశైలం, పూర్ణచందర్, బుర్కా బుచ్చిరాములు, గజ్జి సోమయ్య, నిర్మల, ఉడుత వెంకన్న, తాళ్లపెల్లి ప్రభాకర్, భూక్య శంకర్, మోహన్, బిచ్చు, రామచంద్రు, రాజా, మద్దెల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కేయూ తైక్వాండో జట్లకు క్రీడాకారుల ఎంపిక

- **ఆల్ఇండియా పోటీల్లో పాల్గొననున్న పురుషులు, మహిళల జట్లు**



అక్షరశక్తి, హనుమకొండ, అక్టోబర్ 30: కాకతీయ విశ్వవిద్యాలయ పురుషులు, మహిళల తైక్వాండో జట్ల ఎంపికలు శుక్రవారం స్పోర్ట్స్ బోర్డు ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. వివిధ వెయిట్ కేటగిరీల్లో జరిగిన ఎంపికల్లో పురుషుల విభాగం నుంచి ఆరుగురు, మహిళల విభాగం నుంచి నలుగురు క్రీడాకారులు ఎంపికైనట్లు స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి డాక్టర్ శాస్త్రి తెలిపారు. ఎంపికైన పురుషుల జట్టు రాజస్థాన్‌లోని జైపూర్ వివేకానంద గ్లోబల్ యూనివర్సిటీలో, మహిళల జట్టు ఉత్తరప్రదేశ్‌లోని నోయిడా శారదా యూనివర్సిటీలో నిర్వహించనున్న ఆల్ఇండియా ఇంటర్ యూనివర్సిటీ తైక్వాండో పోటీల్లో పాల్గొననున్నట్లు సెలక్షన్ ఇన్‌చార్జి డాక్టర్ కుమార్ వెల్లడించారు. ఎంపికైన క్రీడాకారులను స్పోర్ట్స్ బోర్డు అధికారులు అభినందించారు.

Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.